సమ్మోహనం..
హరికథా గానం!



హరికథాగానం చేస్తున్న దృశ్యం(ఫైల్)



సండే స్పెషల్

- సర్వకళా సమాహారంగా కథా ప్రక్రియ
- నగరంలో ఏటా హరికథా సప్తాహం
- ప్రోత్సాహం అందించాలంటున్న హరి కథకులు
- నేడు హరికథా పితామహుడు 'నారాయణదాసు' జయంతి

శ్రీకాకుళం కల్చరల్: అనేక కళల సమాహారమైన హరికథకు ఒకప్పుడు అపూర్వ ఆదరణ లభించేది. సందర్భానుసారంగా హావ, భావ, రాగ, తాళ, నాట్య విన్యాసాది కళలను ఆవిష్కరించే ఈ ప్రాచీన జానపద కళారూపాన్ని సామాన్యుని మనో హృదయ రంజకంగా తీర్చిదిద్దిన ఘనత హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసుకే దక్కుతుంది. కొన్ని గంటల వ్యవధిలో పురాణ గాథలు, కీర్తనలు, పద్యం, మంజరి, తోహరా, వచనాలతో రసవత్తరమైన గాన, తాళ, భావయుక్తమైన మహోన్నత కథా కథనం తయారుచేసి నవరస భరితంగా ప్రదర్శించగల గంధర్వుడు ఆదిభట్ల. హరికథకుల చరిత్రపై 'తెలుగు హరికథా చరిత్ర' అనే మహత్తర గ్రంథాన్ని రచించి చరిత్రలో స్థానం సంపాదించిన వారు డాక్టర్ తుమాని దోణప్ప. ఈ పరిణామ దశలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు ధర్మప్రచార పరిషత్తు, అన్నమాచార్య ప్రాజెక్టుల ద్వారా హరికథలను ఆదరించి జీవింపచేస్తున్నారు. ఆవిధంగా హరికథం ఇప్పటికీ సజీవంగా నిలుస్తోంది. ముఖ్యంగా రేడియోలలో ఇప్పటికీ హరికథకులకు ఆదరణ లభిస్తోంది. నాటి ప్రోగ్రాం ఆఫీసరుగా ఉన్న బాలంతరపు రజనీకాంతరావు ఈ హరికథలను ఏర్పాటు చేశారు. నాటినుంచి ఇప్పటికీ ప్రతి మంగళవారం రాత్రి 10గంటలకు హరికథలను ఎంతో మంది వింటున్నారు. హరికథ కళాకారులకు కట్టు, బొట్టు, జుట్టు, నడత, నిష్ఠ, ప్రతిష్ఠ, ఆచారం, ఆచరణ అన్నీ ఆదర్శవంతంగా ఉండాలి. గతంలో వినాయక చవితి, దసరా ఉత్సవాలలో తప్పనిసరిగా హరికథా గానం ఏర్పాటు చేసేవారు. అయితే టీవీ, సినిమా, సామాజిక మాధ్యమాలలో పడిన ప్రజలకు వీటిని చూసే తీరిక లేకుండాపోయింది.

జిల్లాలో హరికథకులు..

శ్రీకాకుళం జిల్లా హరికథా చరిత్రలో ఈశ్వర సత్యనారాయణ శర్మది ప్రత్యేక స్థానం. ఈయన శర్మద రామాయణం, భక్తనందనార్, సతీసులోచన, వామన చరిత్ర, లక్ష్మీవిజయం, త్యాగరాజ, శ్రీనివాస కల్యాణం, సతీ పరిణయం రచించారు. హరికథలపై పరిశోధన గ్రంథాన్ని రచించి బరహంపూర్ యూనివర్సిటీకి సమర్పించి డాక్టరేట్ పొందారు డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు. ఇంకా ఎందరో హరికథ గానం చేస్తూ జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చారు. ప్రస్తుతం సుమిత్రా కళాసమితి ప్రతి ఏడాది హరికథా సప్తాహం నిర్వహిస్తూ నేటితరానికి హరికథను పరిచయం చేస్తోంది.

- సీనియర్ భాగవతార్‌లలో ఒకరైన దివంగత దూసి బెనర్జీ భాగవతార్ హరికథలతో ఎందరినో మెప్పించారు. నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఎదుట ఆంగ్లంలో పది నిమిషాల పాటు 'సీతా కల్యాణం' హరికథా గానం చేసి ప్రశంసలు పొందారు. బెనర్జీ విశాఖలో జరిగిన ఓ కార్యక్రమంలో సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషులో హరికథ చెప్పి ప్రేక్షకుల నుంచి కరతాళ ధ్వనులు అందుకున్నారు.
- ప్రస్తుతం హరిదాసులలో సీనియర్ హరికథకులుగా రాణిస్తున్న బుసకల రంగారావు భాగవతార్‌కు 2010లో ఉగాది పురస్కారం లభించింది. టి.వి, రేడియోలలో మంచి కథలు చెప్పి ఎన్నో సన్మానాలు పొందారు. వీరితోపాటు శారదాంబ భాగవతారిణి, మీనాక్షి భాగవతారిణి, యెన్ని రామం (శ్రీకాకుళం), ముగితి వెంకటనారాయణ (అంగూరు), బొంతలకోటి యతిరాజులు (కుసుంపురం), వడగ సుబ్రహ్మణ్యం (శ్రీకాకుళం), జయంతి సావిత్రి (శ్రీకాకుళం), రోణంకి మీనాక్షి (పొందూరు), ఎస్.శారదాంబ (శ్రీకాకుళం), సరోజినీ (శ్రీకాకుళం), పి.వి.సత్యనారాయణ (ఎచ్చెర్ల), ఎం.శివదండాశి (మెళియాపుట్టి), పిల్లా వెంకటేశం (హిరమండలం), ఎం.శ్రీనివాసరావు (పాతటెక్కలి), బంకుపల్లి రామచంద్రమూర్తి (ఆమదాలవలస) భాగవతార్‌లు హరికథ కళకు జీవం పోస్తున్నారు.

ప్రోత్సాహం అవసరం..



ప్రజలను సన్మార్గంలో నడిపించేవి హరికథలు. ప్రస్తుత కాలంలో హరికథలను ఆదరణ తగ్గుతోంది. భక్తి కథలు, సంప్రదాయ కథలు చెప్పడం ద్వారా ప్రతివారికి మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించవచ్చు.

– శారదాంబ భాగవతారిణి

విద్యార్థులకు పరిచయం చేయాలి..



ప్రస్తుత కాలంలో హరికథలు చెప్పించే వారే కరువయ్యారు. యువత నేర్చుకునేందుకు ముందుకు రావాలి. హరికథలను కళాశాల, స్కూల్ స్థాయిలలో ఈ కళను పరిచయం చేయాలి. ప్రైవేటు ఛానల్స్‌లోనూ హరికథలను ప్రసారం చేయాలి.

– మీనాక్షి భాగవతారిణి

ఆదరించాలి..



టీటీడీ ధర్మప్రచార పరిషత్ ద్వారా గతంలో జిల్లాల్లో కథకులచే హరికథలను చెప్పించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. తిరుమలకు పిలిచి అక్కడ ప్రదర్శన చేయిస్తున్నారు. రేడియో, సప్తగిరి ఛానల్స్, సుమిత్ర కళాసమితి మాత్రమే ప్రోత్సహిస్తున్నాయి. హరికథా మహోత్సవాలు నిర్వహించి కథకులను ప్రోత్సహించాలి.

– బి.రంగారావు భాగవతార్

•మమ్మేలుకోవయ్యా..మహా గణపయ్య





గుజరాతీపేట దేవాంగుల వీధిలో గౌరీవరమేశ్వర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శనివారం 108 ప్రసాదాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం దీపారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం కల్చరల్

ఉపాధి బకాయిలు రూ.110 కోట్లు



మాట్లాడుతున్న గంగరాపు సింహాచలం, ప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పెండింగ్‌లో ఉన్న రూ.110 కోట్ల ఉపాధి నిధులు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శుల ఎస్.ప్రసాద్, గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలో నగరంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ జూన్, జూలై, ఆగస్టు నెలల బకాయిలు చెల్లించకుండా అన్యాయమన్నారు. ఒక్క శ్రీకాకుళం జిల్లాకే రూ.110కోట్లు బకాయి పడితే రాష్ట్ర వ్యాప్తంగా ఇంకెంత పెండింగ్‌లో ఉందో తెలియజేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తక్షణమే స్పందించి ఉపాధి వేతనదారులకు ఆదుకోవాలని కోరారు.

12 ఏళ్ల బాలుడికి అరుదైన చికిత్స



కార్తీక్‌ను డిశ్చార్జ్ చేస్తున్న వైద్యసిబ్బంది

అరసవల్లి: అరుదైన, ప్రాణాంతకమైన డిఫ్యూజ్ ఎన్సెఫలైటిస్‌తో బాధపడుతున్న 12 ఏళ్ల కార్తీక్ అనే బాలుడికి విజయవంతంగా చికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు మెడికవర్ ఆస్పత్రి పీడియాట్రిక్ ఇంటిన్సివిస్టు డాక్టర్ ఎం.శ్రీరంగ తెలిపారు. ఈమేరకు బాలుడిని శనివారం డిశ్చార్జి చేశారు. మెదడులో ఫ్రాంటల్ ప్యారియటల్, ఆక్సిపిటల్ లోబ్స్‌లో తీవ్రమైన వాపుతో వ్యాధి బయటపడుతుందని.. దీన్ని గుర్తించి వెంటనే అధునాతన న్యూరో ఇమేజింగ్, కచ్చితమైన చికిత్స ప్రణాళికతో రోగిని కోలుకునేలా చేశామని చెప్పారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన ఊన్న రాజేశ్వరమ్మ కుటుంబ సభ్యులు రూ.1,00,001 విరాళంగా అందజేశారు. ఈమేరకు శనివారం ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్‌కు విరాళ నగదును దాతలు అందించారు. దాతలకు ప్రత్యేక దర్శనంతో పాటు శేషవస్త్రాలు, జ్ఞాపిక అందజేసారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన ధర్నాకు తరలిరండి



ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు

శ్రీకాకుళం రూరల్: జిల్లా వ్యాప్తంగా రైతులకు యూరియా కొరతకు కారణం కూటమి ప్రభుత్వం చేతగానితనమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు శనివారం అన్నారు. యూరియా కొరత నేపథ్యంలో మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాల మేరకు శ్రీకాకుళం పరిధిలోని పొన్నాడ బ్రిడ్జి వద్ద జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి జిల్లా పరిషత్‌లో జరిగే గ్రీవెన్స్‌సెల్ వరకు సోమవారం నిర్వహించే నిరసన ర్యాలీ, ధర్నాలో రైతులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ హయాంలో రైతులు రాజులా బతికారని, కూటమి ప్రభుత్వంలో రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా కేంద్రాలను ఉత్సవ విగ్రహాల్లా మార్చారని మండిపడ్డారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక ఆహ్వానితుడు సాయికుమార్

రణస్థలం : మండల పరిధిలో ఉన్న గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు అధికారుల సహకారం అవసరమని మండల ప్రత్యేక ఆహ్వానితుడు పిన్నింటి సాయికుమార్ అన్నారు. రణస్థలం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మౌలిక వసుతులైన తాగునీరు, రహదారులు, విద్యుత్ దీపాలు, ఇంటింటికి మరుగుదొడ్లు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, రావాడ పీహెచ్‌సీ వైద్యులు యమున, ఎంఈవో ఎ.త్రినాథరావు, పంచాయతీ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ధర్మాన పరామర్శ



చిన్నమ్మడు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ధర్మాన ప్రసాదరావు

గార: మండల కేంద్రం గారలో దంత చిన్నమ్మడు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం పరామర్శించారు. వమరవల్లి గ్రామానికి చెందిన బొచ్చు రమణమూర్తి, అభిరు గురన్న, కొమనాపల్లి అప్పారావు మృతి చెందడంతో ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు పీస గోపి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, కోనాడ నర్సింగరావు, అరవల రామారావు, మార్పు మన్మథ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు పంపిణీలో కూటమి వైఫల్యం



కొర్ల శిరీష

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో రైతులకు ఎరువులు పంపిణీ చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి కొర్ల శిరీష శనివారం మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ఇంటి వద్దకే కావాల్సినంత ఎరువులు అందేవన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ఎరువుల కోసం రైతుల ఇబ్బందులే కనిపిస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి ఉన్న జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రమంతా ఇంకెంత దారుణంగా ఉందో తెలుస్తుందన్నారు. ఎరువుల నిల్వలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి నిఘా పెంచాలన్నారు.

కూటమి పాలనలో రైతుకంట కన్నీరు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీకాకుళం రూరల్: కూటమి ప్రభుత్వంలో రైతులంతా కన్నీరు పెడుతున్నారని, ఆ ఉసురు పాలకులకు తప్పక తగులుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దన్‌రావు అన్నారు. పెదపాడులోని ధర్మాన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు రుణాలు, ఎరువులు, యూరియా అందించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు మద్దతుగా శ్రీకాకుళం నియోజకవర్గ రైతులంతా సోమవారం ఉదయం 9 గంటలకు పొన్నాడ బ్రిడ్జి వద్ద జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి జిల్లా పరిషత్ గ్రీవెన్స్ వరకూ చేపడుతున్న ధర్నా, నిరసనలు కార్యక్రమంలో రైతులంతా హాజరుకావాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వెలమ కుల సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఏడాది రైతులకు ఇన్సూరెన్స్ చెల్లించకపోవడం వల్ల బీమా డబ్బులు సైతం అందడం లేదన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మూకళ్ల తాతబాబు మాట్లాడుతూ రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని సైతం ఎత్తివేశారని, రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. సమావేశంలో జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు రౌతు శంకరరావు, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు బోర నర్సునాయుడు, శ్రీకాకుళం అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు గుండ హరేష్, అసెంబ్లీ గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు సత్యనారాయణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఊటపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

ఘనంగా ఆరుద్ర శతజయంతి ఉత్సవం



విజేతలకు బహుమతులు అందిస్తున్న తెరవే సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక అధ్యక్ష, కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో సినీ గేయ రచయిత ఆరుద్ర శతజయంతి ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆరుద్ర ఎన్నో సందేశాత్మక సినీ గీతాలను రచించారని చెప్పారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ టంకాల శ్రీనివాస్, రచయితలు వాండ్రంగి కొండలరావు, డాక్టర్ కోమలరావు, విశ్రాంతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తులాల సవరమ్మ, భోగెల ఉమామహేశ్వరరావు, ముట్నూరు ఉపేంద్రశర్మ, సత్యానందం, త్రినాథరావు, ఈశ్వరరావు, కిల్లాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి



ధర్మవరంలో నీటమునిగి పాడైన పంటలను పరిశీలిస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

ఎచ్చెర్ల : ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట నీట మునిగి పాడైపోయిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత రైతులకు ఎకరాకు రూ.20 వేలు చొప్పున పరిహారం అందించాలని కౌలు రైతు సంఘం రైతు జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ డిమాండ్‌చేశారు. ఎచ్చెర్ల మండలం ధర్మవరం ప్రాంతంలో నీటమునిగిన పంటలను శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అల్లు కృష్ణ, రుప్ప పెంటయ్య, కె.లక్ష్మణరావు, పున్నయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ప్రత్యేకాహ్వానితుడు వెంకటరమణ

జి.సిగడాం: పంచాయతీలను అన్ని విధాలా అభివృద్ధి సాధించాలంటే సర్పంచ్‌లే కీలక పాత్ర పోషించాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ అన్నారు. శనివారం జి.సిగడాంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీకాకుళం డివిజనల్ పంచాయతీ అధికారి గోపిబాల, ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: పంచాయతీలు సుపరిపాలన దిశగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలని శ్రీకాకుళం ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ అన్నారు. ఎంపీపీ అంబటి నిర్మల అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో శిక్షణా తరగతులు నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

రిమ్స్ అన్నపూర్ణకు విరాళం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన అన్నపూర్ణ సంఘం అన్నప్రసాద వితరణకు విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిల్లాన మాధవరావు మనవడు నాగ ఆంజనేయ అభయరామ్ పుట్టిన రోజు సందర్భంగా రూ.10వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అన్నపూర్ణ సంఘం కార్యదర్శి కిల్లాన ఫల్గుణరావు, జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, పైడి కోటేశ్వరరావు, లక్ష్మణరావు, వెంకటరావు, శ్రీరాములు పాల్గొన్నారు.

ఎఫ్‌సీ గోదాముకు నోటీసులు

జి.సిగడాం: పాలఖండ్యాం గ్రామ సమీపంలోని ప్రయివేట్ ఎఫ్‌సీ గోదాముకు పంచాయతీ కార్యదర్శి రజిత్‌కుమార్ శనివారం నోటీసులు జారీ చేశారు. ఐదేళ్లుగా పన్ను చెల్లించకపోవడంతో నోటీసులు పంపించామని కార్యదర్శి చెప్పారు.

విద్యార్థులకు శారీరక దృఢత్వం అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం: విద్యార్థులు ఎంత దృఢంగా ఉంటే అంత ఆరోగ్యకరంగా ఉంటారని జిల్లా తపాలాశాఖ సూపరింటెండెంట్ వండాన హరిబాబు అన్నారు. వరం మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం ఫిట్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. ఆదివారం శ్రీకాకుళం ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలోని ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీబీపీ సదస్సుకు వర్శిటీ రిజిస్ట్రార్



సర్టిఫికెట్ అందుకుంటున్న రిజిస్ట్రార్ సుజాత

ఎచ్చెర్ల : లైఫ్‌సైన్స్, బయాలజీ రంగాల్లో మార్పులపై మద్రాస్ ఐఐటీ నిర్వహించిన ప్రత్యేక కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం (సి.బి.పి)కు డాక్టర్ బీఆర్ఏయూ వర్శిటీ రిజిస్ట్రార్ పి.సుజాత హాజరయ్యారు. ఈ నెల 22 నుంచి శనివారం వరకు ఐఐటీ టీచింగ్ లెర్నింగ్ సెంటర్ ఈ కార్యక్రమం నిర్వహించింది. యూజీసీకు చెందిన మాలవ్య మిషన్ ఆధ్వర్యంలో చివరి రోజు కార్యక్రమంలో సి.బి.పి సర్టిఫికెట్‌ను సుజాత అందుకున్నారు.

యువతకు కనువిప్పుగా 'గుణనిధి వృత్తాంతం'

శ్రీకాకుళం కల్చరల్: పెడతోవ పట్టే యువతకు కనువిప్పు కలిగించే చక్కని సందేశం గుణనిధి వృత్తాంతమని వక్త పొందూరు సుధాకర్‌శర్మ అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో సాహిత్య గణపతి ఉత్సవాలలో భాగంగా 'కాశీఖండం-గుణనిధి వృత్తాంతం'పై ఆధ్యాత్మిక ప్రవచనం శనివారం జరిగింది. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన పట్ల శ్రద్ధ చూపించాలని తెలిపేదే గుణనిధి కథ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు నరసింహమూర్తి, నారాయణమూర్తి, కోమలరావు, వెంకటరమణ, చంద్రరావు, చాగంటి బాపయ్య, విశ్వేశ్వరరావు, అనురాధ, సరస్వతి, మంగమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.